క్లుప్తంగా

ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం

వేల్పూర్: మండల కేంద్రమైన వేల్పూర్‌లో శనివారం మినీ వాటర్ ట్యాంకు, పైపులైను నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తీగెల రాధామోహన్, ఉప సర్పంచ్ పిట్లసత్యం, ఆర్‌టీఏ సభ్యుడు రేగుల్ల రాములు, నాయకులు బబ్బూరు ప్రతాప్, బీమ రాజేందర్, వీడీసీ అధ్యక్షుడు కమలేష్, బాలయ్య, ప్రశాంత్, కార్తీక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా పనులు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని జిరాయత్ నగర్ చేపడుతున్న మైనార్టీ షాదీఖాన నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్ ఇంతియాజ్ పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు పండిత్‌పవన్, ఖాందేష్ శ్రీనివాస్,జహీర్, అతీక్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నవీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అభ్యుదయ గ్రామీణ వికాసం సంఘం ఆధ్వర్యంలో శనివారం చేతిరాత పుస్తకాలను పంపిణీ చేశారు. చేతి రాతను అందంగా తీర్చిదిద్దేందుకు పుస్తకాలు దోహదపడతాయని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు గంజి సాయన్న, వసంత్, రాజారెడ్డి, నరేంద్ర శేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ వీరేందర్, హెచ్ఎం అరుణ పాల్గొన్నారు.

గురువులను పూజించాలి

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం రాంపూర్ గ్రామంలో శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. నందిపేట ఖండ కార్యావాహ గుజ్జేటి గణేష్ మాట్లాడుతూ గురు పూజోత్సవం విశిష్టతను తెలియజేశారు. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి జ్ఞానంతో వెలుగులు నింపే గురువులను పూజించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

సాహిత్యంలో విద్యార్థుల ప్రతిభ

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ పాఠశాల విద్యార్థులు కథలు చెప్పడంలో తమ ప్రతిభను కనబరిచారని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మునీరొద్దీన్ అన్నారు. చిన్న తనంలోనే సాహిత్యంలో రాణించడం గొప్ప విషయం అన్నారు. శనివారం పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాహిత్య పుస్తకాల పఠనంపై అవగాహన కల్పించారు. 30 మంది విద్యార్థులు కథలు చెప్పారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు ప్రవీణ్‌శర్మ, రవీందర్, శంకర్, నాగప్ప, కృష్ణప్రసాద్, సుజాత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో పనులు వద్దు..

ఎడపల్లి(బోధన్): 18 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయిస్తే జైలుకు పంపుతామని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నాగెల్లి బాబు అన్నారు. శనివారం ఎడపల్లిలో చైల్డ్ వెల్ఫేర్, ఆరోగ్య శాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో బాల కార్మికుల నిర్మూలన కోసం తనిఖీలు చేపట్టారు. ఒక ఇంజనీరింగ్ దుకాణంలో బాల కార్మికుడిగా పని చేస్తున్న అయాన్ బాబును బాలల పరిరక్షణ అధికారులు పట్టుకున్నారు. తనిఖీల్లో అధికారులు శౌకత్ బేగం, శ్రీకాంత్, మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

భీమ్‌గల్: మండలంలోని ముచ్కూర్‌కు చెందిన సూర్య అనే యువకుడి చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ పథకం నుంచి రూ. 3 లక్షల విలువ చేసే ఎల్‌వోసీని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



రెంజల్(బోధన్): నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ చెప్పారు. శనివారం మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మోసానికి గురైతే వెంటనే 100 లేదా 1930 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో భాగంగా 47 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై సాయన్న తదితరులు పాల్గొన్నారు.

విజయం కోసం కృషి చేయాలి



వర్ని: కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులకు పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి సూచించారు. మోస్రా, చందూర్, వర్ని మండలాల అధ్యక్షులుగా నియమితులైన కొత్తిమీర్ కార్ లక్ష్మణ్, సురేష్ బాబా ,పోతరాజు శ్రీనివాస్‌లను శనివారం రాజిరెడ్డి సన్మానించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు ప్రతాప్ సింగ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ బోయిడి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రోడ్డుపై భారీ గుంతలు

- అవస్థలకు గురవుతున్న వాహనదారులు



నాగన్‌పల్లి శివారులో అంతర్రాష్ట్ర రోడ్డుపై ఏర్పడిన గుంతలు



బోధన్ మండలంలోని నాగన్‌పల్లి పసుపు వాగు వద్ద అంతర్రాష్ట్ర రోడ్డుపై ఏర్పడిన గుంతలు

బోధన్: బోధన్ పట్టణ కేంద్రం నుంచి నాగన్‌పల్లి, సాలూర క్యాంప్ గ్రామాలు సాలూర మండల కేంద్రం మీదుగా మహారాష్ట్ర వైపు వెళ్లె అంతర్రాష్ట్ర రోడ్డుకు పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా పట్టణ శివారులోని మర్రిమైసమ్మ ఆలయం సమీపం నుంచి నాగన్‌పల్లి గ్రామం వరకు కిలో మీటరు పైగా పొడువున రోడ్డుకు అడుగడుగున గుంతలు పడ్డాయి.పసుపు వాగు వంతెనపై రోడ్డుకు గుంతలు ఉన్నాయి. ఈ రోడ్డు పై ప్రయాణం ప్రమాదకరం మారింది. రాత్రి వేళల్లో వర్షం నీరు నిలిచి భారీ గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా అటు మహారాష్ట్ర ప్రాంతం నుంచి, ఇటు తెలంగాణ ప్రాంతంలో వివిధ ముఖ్య నగరాల నుంచి లారీలు, ఆర్టీసీ బస్సులు, ప్యాసింజర్ ఆటోలు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాలు అత్యధిక సంఖ్యలో రాకపోకలుంటాయి. బోధన్, సాలూర మండలంలోని సుమారు 15 గ్రామాల పైగా ప్రజలు ఇదే రోడ్డు మీదుగా వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు ఉంటాయి. కాగా బోధన్ నుంచి సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వరకు 8 కిలో మీటర్ల పొడువుతో విస్తరించి ఉన్న ఈ రోడ్డు నిర్వహణ ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రెండేళ్ల క్రితమే నేషనల్ హైవే అథారటీ అధీనంలోకి వెళ్లింది. రోడ్డు గుంతల వల్ల ప్రజా రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నవీపేటలో సమ్మెలో పాల్గొన్న కార్మికులు



ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద..

నవీపేట(బోధన్): ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. నవీపేటలో కార్మికులకు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మద్దతు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్ , జంగం గంగాధర్, నాయకులు పద్మ, నాయక్ వాడి శ్రీనివాస్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): సఫాయి కార్మికులే నిజమైన దేవుళ్లు అన్న సీఎం కేసీఆర్ వాళ్ల సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఐఎఫ్‌టీయూ నాయకులు దాసు అన్నారు. ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూర్య శివాజీ, ఎండీ ఖాజా, లక్ష్మయ్య, గంగారాం, పుష్ప, గంగామణి, లింగవ్వ, నర్సు, పోసాని పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బోధన్‌రూరల్: సాలూర మండలం సాలూర క్యాంప్ ప్రాథమికోన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో ఫ్యాన్లను వితరణ చేశారు. పట్టణంలోని ఆచన్‌పల్లికు చెందిన ముళ్ళపూడి శ్రీనివాస్ సహకారం అందించారన్నారు. క్లబ్ చైర్మన్ అబ్బగొని గంగాధర్ గౌడ్, ప్రతినిధులు నర్సారెడ్డి, చక్రవర్తి, సత్యం, శ్రీనివాసరాజు, ముత్తయ్య, రమణారెడ్డి, హెచ్ఎం భారతి పాల్గొన్నారు.

సౌండ్ బాక్స్..

పెర్కిట్(ఆర్మూర్): గోవింద్‌పేట్ ప్రాథమిక పాఠశాలకు స్థానిక విత్తన వ్యాపారి అప్పాల ఆనంద్ రెడ్డి శనివారం సౌండ్ బాక్సును వితరణ చేశారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆనంద్ రెడ్డి ప్రతినిధిగా గ్రామానికి చెందిన నాయిని వెంకన్న హెచ్ఎం పద్మావతికి అందజేశారు.

ఉచిత బియ్యం పంపిణీ చేయాలి

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని పేదలకు వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంకెదుట బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీ చేయకపోవడానికి నిరసిస్తూ ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జెస్సు అనిల్, బొట్ల విజయ్, మీసాల రాజేశ్వర్, దోండి ప్రకాష్, శ్యామ్‌గౌడ్, పులి యుగంధర్, ఖాందేష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి..



మోర్తాడ్: భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నవీన్‌కుమార్ సూచించారు. శనివారం శెట్‌పల్లిలో మొక్కజొన్న, సోయా, పసుపు పంటలను పరిశీలించారు. అనంతరం ఎరువుల వాడకంపై ఆయన రైతులకు తెలియజేశారు.

19న మెగా ఉచిత వైద్య శిబిరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అయేషా ఫాతిమా

బోధన్: పేదల కోసం అయేషా ఫాతిమా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 19న బోధన్‌లోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆవరణలో నియోజక వర్గ స్థాయి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా తెలిపారు. వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఆమె ఆవిష్కరించారు. హైదరాబాద్, నిజామాబాద్, బోధన్ నుంచి 30 మంది స్పెషలిస్టులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ట్రస్ట్ ద్వారా ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. ఈఎన్‌టీ, కార్డియోలాజీ, ఆర్థోపెడిక్, గైనకలాజీ తదితర వ్యాధులకు సంబంధించిన వారు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర గంగారాం, పట్టణ అధ్యక్షుడు రవీంద్ర యాదవ్, మారుతి మందిరం చైర్మన్ గుమ్ముల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నహీనఫిర్దోస్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా 5వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ చేస్తామన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, కెమిస్ట్రీ పీజీటీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పెర్కిట్(ఆర్మూర్): నియోజకవర్గంలోని నందిపేట, ఆర్మూర్ మండలాలకు చెందిన పలు కుల సంఘాల సభ్యులు శనివారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్శితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, బెన్కి గంగామోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శం



వర్ని: అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి వెల్లడించారు. శనివారం మండలంలోని శ్రీనగర్ గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, మరో రూ. 20 లక్షలతో డ్రైయినేజీ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రాష్ట్రంలో ఎక్కడా నిర్మించని విధంగా 15 వేల డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించిన ఘనత స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



కమ్మర్‌పల్లి: పోడు భూముల పట్టాల పంపిణీ వ్యవహారంలో అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం కమ్మర్‌పల్లిలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పట్టాల మంజూరుకు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో సారా సురేష్, అశోక్, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం ఉద్యమించాలి



రుద్రూర్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ అమలు కోసం ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమించాలని వర్ని ఉమ్మడి మండలాల సీపీఎస్ అధ్యక్షుడు గాండ్ల మోహన్ పిలుపు నిచ్చారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న పాత పింఛన్ సాధన సంకల్ప రథయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రథయాత్ర 25న నిజామాబాద్‌కు రానున్నట్లు పేర్కొన్నారు. సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి విక్రమ్, జిల్లా కార్యదర్శి గోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేందర్, శాస్త్రవేత్త దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చూసి అండగా నిలవండి



కూరగాయల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

పెర్కిట్(ఆర్మూర్): అభివృద్ధి పనులు చూసి వచ్చే ఎన్నికల్లో తనను మూడో సారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 21వ వార్డులో శనివారం నిర్వహించిన నమస్తే నవనాథపురం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తాను ఎప్పుడు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్ లిక్కి శంకర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, మందాపురం సుభాష్ గౌడ్, మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, ఖాందేశ్ శ్రీనివాస్, కామని నరేష్ పాల్గొన్నారు.

సంప్రదాయానికి ఆనవాళ్లు బోనాలు



బాల్కొండ: బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. 1869లో హైదరాబాద్‌లో ప్రాణాంతకమైన మలేరియా వ్యాధి ప్రబలింది. ప్రకృతి కోపాన్ని గమనించిన పెద్దలు అమ్మవారిని ప్రసన్నం చేసుకునేందుకు ఉత్సవాలు, జాతరలు నిర్వహించారు. వ్యాధులు సోకకుండ అమ్మవారిని కోరుకునేందుకు నిర్వహించే ఈ ఉత్సవానికి బోనాలు అని పేరు పెట్టారు. బోనాలకు కొత్త కుండలను ఉపయోగించి అందులో అన్నం వండి అనంతరం పసుపు, కుంకుమాలతో పూజలు చేసి వేపాకులతో అలంకరిస్తారు. బోనాల పండుగలలో కుంపటిలో నిప్పులపై గుగ్గిలం వేస్తారు. తద్వారా ఇళ్లల్లో క్రిములు వ్యాప్తి చెందకుండా అవి నివారిస్తాయని పూర్వీకులు చెబుతారు. బోనాల పండగలో ప్రతిది శాస్త్ర ప్రకారమే ఉంటుందని ఎస్సారెస్పీ కోదండ రామాలయ అర్చకుడు రామ ప్రభు వెల్లడించారు. బోనాల పండగలో వల గొడుగుతో ముందుంటాం అని గంగపుత్రుడు ఎల్లయ్య తెలిపారు. బోనాల పండుగ వచ్చిందంటే చాలు నిష్ఠతో పూజలు చేస్తామని పోతరాజు బక్కూరి గంగారాం పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా బోనాల పండుగ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి యోగేశ్వర కాలనీలో ఉన్న జెంటిల్‌కిడ్ పాఠశాలలో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గ్రామ దేవతలు, పోతురాజుల వేషాధారణలో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాశ్, ప్రిన్సిపాల్ లత తదితరులు పాల్గొన్నారు.

స్మైల్స్ పాఠశాలలో..



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లోని స్మైల్స్ పాఠశాలలో బోనాల సంబురాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ రఫీ గోహార్, డైరెక్టర్ షబానా గోహార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..



నందిపేట్: నందిపేట్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో బోనాల పండుగ సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ బండి రామగౌడ్, హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. లోటస్, క్షత్రీయ, విద్యా హైస్కూల్, ప్రజ్ఞ ఐఐటీ స్కూల్‌లలో బోనాలు పండుగను పురస్కరించుకొని



చిన్నారుల వేషధారణ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్స్ అంబికపవార్, రామా పాల్గొన్నారు.

వేల్పూర్‌లో..



వేల్పూర్: మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూలులో బోనాలు ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు పోతురాజులు, మహంకాళి వేషధారణతో అలరించారు. స్కూల్ కరస్పాండెంట్ పిల్లమారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం



బోధన్‌టౌన్: పట్టణంలోని ఏకచక్రేశ్వర మందిరంలో మాస శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

నాందేవ్ మహరాజ్ పుణ్య తిథి



రుద్రూర్: పోతంగల్ బాలాజీ మందిరంలో మేరు కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ నాందేవ్ మహారాజ్ గులాల్ పుణ్య తిథి కార్యక్రమాన్ని నిర్వహించారు. పుణ్యతిధికి డీసీసీ డెలిగేట్ శ్రీనివాస్ రావ్ రూ. 20 వేల విరాళం అందజేశారు. మేరు సంఘం అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు షాజీ, ప్రధాన కార్యదర్శి కీర్తి రవి, శ్రీనివాస్, రాజు, జెల్ల గంగాధర్, రమేష్, రాములు, లక్ష్మణ్, భూషణం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బోధన్‌టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా కార్యాలయంలో వైద్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి దోమల నివారణకు అందులో ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. కమిషనర్ ఖమర్ అహ్మద్, జిల్లా మలేరియా అధికారి తుకారాం, ఉప వైద్యాధికారి విద్య, సూపర్ వైజర్లు నిర్మల, కిరణ్ పాల్గొన్నారు.

సినిమాలు — తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1	మహావీరుడు - (తెలుగు) - 11.50, 06.45, 10.10; మిషన్ ఇంపాజిబుల్ (ఇం) - 3.15
స్క్రీన్-2	సామజవరగమన(తెలుగు)-10.00 4.10; రంగబలి (తెలుగు) 1.15; నాయకుడు - 7.10 ; బేబి - 10.25
స్క్రీన్-3	బేబి - 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-4	మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) - 11.00, 2.30, 6.00 9.30

సంక్షిప్తం

ఇద్దరు ఎస్సైల బదిలీ...

బోధన్‌టౌన్: బోధన్ పట్టణ స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్సైలు నవీన్, నరేష్‌లను అదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.

20న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం నులి పురుగుల నివారణ కార్యక్రమంపై శనివారం హెల్త్, ఐసీడీఎస్ సిబ్బంది, టీచర్లకు అవగాహన కల్పించారు. 20న మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

18వ రోజుకు చేరిన రైతుల రిలే దీక్షలు

రెంజల్: రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని రెంజల్ గ్రామ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. రజక సంఘం ప్రతినిధులు వారికి మద్దతుగా దీక్షల్లో కూర్చున్నారు. రజక సంఘం పెద్దలు మూట పోశెట్టి, నగేష్, బాలయ్య, మల్కయ్య, గంగాధర్, అబ్బయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

రుద్రూర్: కోటగిరిలోని ప్రాథమిక పాఠశాలకు క్రీడా పరికరాల కోసం కామారెడ్డి మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు సంతోష్ కుమార్ క్రీడా పరికరాలను అందచేశారు. హెచ్ఎం గంగాధర్, పీఆర్‌టీయూ సభ్యు లు వెంకటేష్, గంగారాజు, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

ఆందోళనకు సిద్ధం కావాలి

బోధన్: సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు సంసిద్ధం కావాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, డివిజన్ ఇన్‌చార్జి నారాయణ పేర్కొన్నారు. శనివారం స్థానిక అసోసియేషన్ భవన్‌లో డివిజన్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారావు, అద్దంకీ ఉషాన్, ప్రతినిధులు జ్ఞానేశ్వర్, సత్యానంద్, ప్రకాశం,నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

నో బ్యాగ్ డే

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని కల్పించేందుకు నో బ్యాగ్ డే కార్యక్రమం చేపడుతున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్కారం ప్రసాద్, ప్రిన్సిపాల్ లక్కారం సాగర్ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బాల్కొండ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బాల్కొండ ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కిసాన్‌నగర్‌లో యువతకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు.

కాంగ్రెస్ ప్రచార కమిటీ సభ్యుడి నియామకం

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రచార కమిటీ సభ్యుడుగా కొల వెంకటేష్‌ను నియమించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తానన్నారు.

నియామకంపై సంబురాలు

బాల్కొండ: మెండోరాకు చెందిన అలిశెట్టి లక్ష్మి నారాయణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించడం పట్ల స్థానికులు స్థానిక ఉన్నత పాఠశాలలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉప సర్పంచ్ మచ్చర్ల రాజారెడ్డి పాల్గొన్నారు.

హాజరు శాతం తగ్గకుండా చూడాలి

బాల్కొండ: విద్యార్థుల హాజరు శాతాన్ని తగ్గకుండా తల్లిదండ్రులు సహకరించాలని ముప్కాల్ కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారిణి వినోద కోరారు. శనివారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులతో ఆమె సమావేశం నిర్వహించారు.